సాక్షి
కామారెడ్డి
బుధవారం | 2 | ఆగస్టు | 2023



సమాజాన్ని కాపాడేది సాహిత్యమే

కళలు, సాహిత్యమే సమాజాన్ని కాపాడతాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ పేర్కొన్నారు.

- 8లో ▸



ఆదర్శంగా తీర్చిదిద్దాలి

గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ మను చౌదరి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0 /22.1

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు నూతన అంబులెన్స్‌లు

కామారెడ్డి టౌన్: జిల్లాకు నూతన అంబులెన్స్‌లు రానున్నాయి. పాత వాహనాల స్థానంలో పది 108 అంబులెన్స్‌లు, ఏడు 102 అంబులెన్స్‌లతో పాటు ఒక పార్థివ దేహాలను తరలించే వాహనం, దోమకొండ మండలానికి అదనంగా మరో 108 అంబులెన్స్ మంజూరు అయ్యాయి. ఈ విషయాన్ని అంబులెన్స్‌ల జిల్లా ఇన్‌చార్జి అనిరుద్, ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్ తెలిపారు.

పదో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని జిల్లా సి విల్ సప్లై అధికారి మల్లికార్జున్ బాబు తెలిపారు. ఆహార భద్రత కార్డులకు యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున ఇస్తామని తెలిపారు.

తహసీల్దార్ల బదిలీ

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం పోలీస్, రెవెన్యూ శాఖల్లో బదిలీలు చేపడుతోంది. ఇప్పటికే ఉన్నతాధికారుల బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. తాజాగా మంగళవారం తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. జిల్లాకు చెందిన తహసీల్దార్లు ఎస్.గోవర్ధన్‌ను సిద్దిపేటకు, కె.గణేశ్‌ను సిరిసిల్లకు, డి.రవీందర్‌ను మెదక్‌కు, ఎం.నారాయణ, కె.గంగాధర్, కె.దన్వాల్, పి.ఆనంద్‌కుమార్, జె.వెంకట్‌రావ్, కె.మోతీసింగ్‌లను నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. నిర్మల్ నుంచి కె.శివప్రసాద్, ఆర్.హిమబిందు, నిజామాబాద్ నుంచి ఎస్.గంగాసాగర్, టీవీ రోజా, వై.సుదర్శన్, ఎస్.లత, వి.సురేశ్, డి.శ్రీధర్, ఎంబీ గఫార్ మియా, మెదక్ నుంచి ఎ.సత్యనారాయణ, హెచ్.భిక్షపతి జిల్లాకు బదిలీపై వచ్చారు. వారికి స్థానాలు కేటాయించాల్సి ఉంది.

అవిశ్వాసం బలపరీక్షపై హైకోర్టు స్టే

నాగిరెడ్డిపేట: వైస్ఎంపీపీ దివిటీ రాజ్‌దాస్‌పై బుధవారం నిర్వహించాల్సిన అవిశ్వాస బలపరీక్ష సమావేశాన్ని హైకోర్టు ఆదేశాలతో రద్దు చేశారు. నాగిరెడ్డిపేట వైస్ఎంపీపీ రాజ్‌దాస్‌పై అవిశ్వాసం ప్రవేశపెడుతూ పలువురు ఎంపీటీసీలు గతనెల 7న ఎల్లారెడ్డి ఆర్డీవోకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం బలపరీక్ష నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అయితే అవిశ్వాస బలపరీక్ష సమావేశం నిర్వహణపై వైస్ఎంపీపీ రాజ్‌దాస్ హైకోర్టును ఆశ్రయించారు. బలపరీక్ష సమావేశంపై హైకోర్టు స్టే విధించిందని ఎల్లారెడ్డి ఆర్డీవో రాథోడ్ రమేశ్ తెలిపారు. హైకోర్టు నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత సమావేశం తేదీని ప్రకటిస్తామన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు పొడిగింపు

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ అందించే సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువును ఈనెల 13వ తేదీ వరకు పొడిగించారని మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారి టి.దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులకు ఈనెల 20న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జిల్లాకేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక




కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో, అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. జావెలిన్ త్రో, వంద, 400 మీటర్ల పరుగు విభాగాలలో అండర్-14, 16, 18, 20 బాలబాలికల జట్లను ఎంపిక చేశామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి తెలిపారు. వీరు 7న హనుమకొండ, వరంగల్‌లలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎంపికైంది వీరే..

ఎం.మోహన్, ఎన్.శ్రీను, కే.సునీత, ఎ.నక్షత్ర, కే.ఇందు, కే.ఆనంద్, బి.సునీల్, ఎం.గణేష్, బి.గంగాసింగ్, కే.నందిని, ఎల్.అఖిల, ఎస్.సోనా, టి.సురేందర్, టి.శివకుమార్, సీహెచ్.అమూల్య, డి.సర్దార్, కే.ప్రతాప్‌సింగ్, ఎం.నితిన్, జి.శాముకు, ఎస్.బాలయ్య, ఎ.విజయ్, జి.అనిల్, డి.జ్ఞానేశ్వర్, డి.గోపాల్, ఎండీ.ఇమ్రాన్, టి.లక్ష్మి, యు.సాయిభవ్య, ఎం.ఈశ్వర్.

వలసలపై ఫోకస్!



- బలం పెంచుకునేందుకు నేతల వ్యూహాలు
- ప్రత్యర్థి పార్టీల నాయకులకు గాలం
- కండువాలు కప్పేస్తూ క్యాడర్‌ను పెంచుకునే యత్నం
- సొంత పార్టీ నేతలు జారిపోకుండా ప్రత్యేక నిఘా

ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ నేతలు తమ బలాన్ని పెంచుకోవడంతో పాటు ప్రత్యర్థిని బలహీనపరిచేందుకు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నారు. ఇతర పార్టీల్లో అసంతృప్తితో ఉన్న నేతలను తమవైపు తిప్పుకునేందుకు ముఖ్య నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల్లోని ద్వితీయ శ్రేణి నేతలకు గాలం వేస్తూ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు.

సాక్షి, కామారెడ్డి : జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలున్నాయి. అన్ని నియోజకవర్గాల్లోనూ ఎన్నికల బరిలో నిలవాలని భావిస్తున్నవారు చాలామందే ఉన్నారు. ప్రధాన పార్టీల్లో టికెట్లకోసం పోటీ తీవ్రంగా ఉంది. ఆయా పార్టీలనుంచి టికెట్లు ఆశిస్తున్న నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. నిత్యం జనంలో ఉంటూ క్యాడర్‌ను పెంచుకునేందుకు యత్నిస్తున్నారు. గుర్తింపు ఉన్న ద్వితీయ శ్రేణి నేతలపై ఆయా రాజకీయ పార్టీల నేతలు ఫోకస్ చేశారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల స్థాయిలో పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే జాజాల సురేందర్ తన బలాన్ని మరింత పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలను తనవైపు తిప్పుకునే యత్నిస్తున్నారు. ఇప్పటికే తాడ్వాయి, గాంధారి, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన పలువురు నేతలకు గులాబీ కండువా కప్పారు. మరికొందరు ముఖ్య నేతలపైనా ఫోకస్ చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇరువురు కూడా ఇతర పార్టీల నేతలను తమవైపు తిప్పుకునే ప్రయత్నంలో ఉన్నారు. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కొంతకాలంగా ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. దీంతో ఆయన అనుచరులు కొందరు ఇతర పార్టీలవైపు మళ్లారు. రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగింది. ఆయన నిర్ణయం కోసం అనుచరలు ఎదురుచూస్తున్నారు.

జుక్కల్‌లో..

జుక్కల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే నిత్యం జనం మధ్యలో ఉంటున్నారు. పనిలో పనిగా ఇతర పార్టీల నేతలకు గులాబీ కండువా కప్పేస్తున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడు వర్గాలుగా విడిపోయింది. మాజీ ఎమ్మెల్యే గంగారామ్‌కు నియోజకవర్గంలో మంచి పట్టుంది. అయితే ఆయనకు పోటీగా లక్ష్మీకాంత్‌రావ్, గడుగు గంగాధర్ కూడా కాంగ్రెస్ టికెట్టు ఆశిస్తున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార ఊరూరా తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి జనాన్ని కలుస్తున్నారు. ఇతర పార్టీల నేతలను చేర్చుకుంటూ, పార్టీ కేడర్‌ను అభివృద్ధి చేసుకుంటున్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ నియోజకవర్గంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వలసల మీద దృష్టి సారించారు. ఇటీవల వివిధ మండలాలకు చెందిన నేతలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రజా సమస్యలపై ఆందోళనలు చేస్తూ భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు.

కదలికలపై కన్ను

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమ పార్టీ నేతలు ఎవరిని కలుస్తున్నారు? ఎటు వెళుతున్నారన్న దానిపై ఆయా పార్టీల నేతలు ఓ కన్నేశారు. నాలుగు రోజులు కనిపించకుంటే ఎందుకు రావడం లేదన్న దానిపై ఆరా తీస్తున్నారు. పార్టీ మారే ఆలోచనలో ఉన్నారా? ఏదైనా అసంతృప్తితో ఉన్నారా అన్నదానిపై అనుచరుల ద్వారా తెలుసుకుంటున్నారు. తమ పార్టీ నాయకులు జారిపోకుండా చూసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి నియోజకవర్గంలో స్థానిక సంస్థలకు సంబంధించి మెజారిటీ ప్రజాప్రతినిధులు అధికార బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారు. గతంలో కాంగ్రెస్‌నుంచి గెలిచిన వారు చాలామంది గులాబీ కండువా కప్పుకున్నారు. అయితే పార్టీని వీడి వెళ్లిన వారిని తిరిగి రప్పించేందుకు కాంగ్రెస్ నేత షబ్బీర్‌అలీ తీవ్ర స్థాయిలో ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో వస్తామని చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలువురు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్, బీజేపీలలో కొనసాగుతున్న పలువురిని బీఆర్ఎస్‌లోకి లాగేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ నాయకత్వంలో నియోజకవర్గంలో ఆ పార్టీ బలంగా ఉంది. అయితే ప్రత్యర్థి పార్టీల్లోని కీలకమైన నేతలను తమవైపు తీసుకోవడం ద్వారా ప్రత్యర్థులను బలహీనపరచవచ్చన్న వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. బీజేపీ నేత వెంకటరమణారెడ్డి కులసంఘాలపైనే ఎక్కువగా ఫోకస్ చేశారు. కుల దేవతల ఆలయాలు, కుల సంఘాల భవనాలు, ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి సాయం అందిస్తూ వారి మద్దతు కూడగడుతున్నారు.

సీఎం చొరవతోనే కాలేజీ మంజూరు

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- జూనియర్ కళాశాలలో డిగ్రీ కాలేజీ ప్రారంభం



డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తున్న హన్మంత్ సింధే

మద్నూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ చూపిన ప్రత్యేక చొరవతోనే మద్నూర్‌కు డిగ్రీ కళాశాల మంజూరైందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రాంసుఖ్ బాల్ ముకుంద్ ఇనాని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. జూనియర్ కళాశాలలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించి మొదటి అడ్మిషన్‌కు సంబంధించిన పత్రాలను స్వీకరించారు. అనంతరం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మద్నూర్‌కు 18 కిలోమీటర్ల దూరంలోనే మరో డిగ్రీ కళాశాల ఉందన్నారు. యాభై కిలోమీటర్లలోపు దూరంలో మరో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉండరాదనే నిబంధన ఉన్నప్పటికీ, సీఎం చొరవ తీసుకుని మద్నూర్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేశారన్నారు. తాను మద్నూర్‌లోని హాస్టల్‌లో ఉండి బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశానని ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు.

తన కంఠంలో ప్రాణమున్నంతవరకు జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాల నేతలు చేసే తప్పుడు ఆరోపణలను పట్టించుకోవద్దని ప్రజలను కోరారు. అనంతరం మండల వ్యాపారులు, ఉద్యోగులు, నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీబాయి, జెడ్పీటీసీ అనిత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్సీపటేల్, నాయకులు శశాంక్ పటేల్, శీను పటేల్, విజయ్, కతలయ్య, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు మహర్దశ!



కామారెడ్డి రైల్వే స్టేషన్

- అమృత్ భారత్ కింద రూ.39.9 కోట్లు మంజూరు
- ఆధునిక సౌకర్యాలు కల్పించనున్న రైల్వే శాఖ

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. స్టేషన్‌ను ఆధునీకీకరించేందుకు రైల్వే శాఖ రూ. 39.9 కోట్లు మంజూరు చేసింది. రైల్వేస్టేషన్ల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకం కింద నిధులు మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన రైల్వేస్టేషన్లను ఆధునికీకరించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ పథకానికి కామారెడ్డి రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేసి, రూ. 39.9 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో స్టేషన్‌లో ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నారు. దీంతో రైల్వే స్టేషన్ రూపురేఖలు మారిపోతాయని భావిస్తున్నారు. ఇప్పటికే రైల్వే లైన్ విద్యుదీకరణ పూర్తయ్యింది. స్టేషన్‌లో పలు సౌకర్యాలు కల్పించారు. తాజాగా అమృత్ భారత్ పథకం ద్వారా స్టేషన్‌లో మరింత మెరుగైన సేవలు అందించనున్నారు. అమృత్ భారత్ పనులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 6న వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు.

ఘనంగా మదన్‌మోహన్‌రావు జన్మదినం



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు జన్మదిన వేడుకలను మంగళవారం ఎల్లారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు రక్తదానం చేశారు. పట్టణంలోని సాయిబాబా ఆలయంలో మదన్‌మోహన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.

'రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రమాదకరంగా మారిన ఇళ్లపై కప్పడానికి పేదలకు తాటిపత్రులను అందించాలన్నారు. సొసైటీల్లో ఆరోగ్య, ఆశా కార్యకర్తలను సభ్యులుగా చేర్పించాలన్నారు. హరితహారంలో తులసి, నేలఉసిరి, మునగ, బొప్పాయి, కరివేపాకు వంటి 5 రకాల ఔషధ మొక్కలను ప్రతి ఇంటికి పంపిణీ చేసేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎకోబ్రిక్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుష్టువ్యాధి నిర్మూలనపై ఈనెల 16 నుంచి 14 రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. జన ఔషధ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మూడు నెలల్లో జిల్లాలో 48 క్యాంపులను నిర్వహించి 380 యూనిట్ల రక్తం సేకరించామని జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ రాజన్న తెలిపారు. సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి రఘుకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంజీవరెడ్డి, కోశాధికారి దస్తీరాం, కార్యవర్గ సభ్యు లు విక్రమ్, నరసింహం, మానేటి కృష్ణ, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయం.. గుడ్డు నయం!

- కొండెక్కిన కూరగాయల ధరలు
- కొనలేకపోతున్న సామాన్యులు
- కోడిగుడ్లకు పెరిగిన గిరాకీ

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అన్నింటి ధరలూ ఆకాశంవైపు పయనిస్తున్నాయి. దీంతో సామాన్యుడు మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. నెలరోజులుగా ధరలు పెరుగుతుండడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కూరగాయలకన్నా గుడ్డు, చికెనే నయం అన్న భావనకు వస్తున్నారు.



రామారెడ్డి: కూరగాయల ధరలు రోజురోజుకు పైపైకి వెళ్తుండడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ఏ కూరగాయ కూడా కొనే ధరలో లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో టమాట ధర కిలోకు రూ. 180కి చేరింది. పచ్చిమిర్చిదీ అదే దారి.. ఏ కూరగాయ తీసుకున్నా పావుకిలో ధర రూ. 20కి తక్కువ లేదు. కూరగాయల ధర కన్నా చికెన్ తక్కువ ధరకు వస్తుండడంతో చాలామంది ప్రత్యామ్నాయంగా మాంసాహారమే బెటరంటూ అటువైపు మళ్లుతున్నారు. రామారెడ్డిలో ఒక కోడి గుడ్డు రూ. 6 కు లభిస్తోంది. ట్రే రూ. 130 నుంచి రూ. 150 పలుకుతోంది. అరకిలో చికెన్ రూ. 70కి అమ్ముతున్నారు. చికెన్ ధర టమాటకన్నా తక్కువ ఉండడంతో మాంసాహార ప్రియులు ప్రత్యామ్నాయంగా చికెన్ కొనుగోలు చేస్తున్నారు. కూరగాయలు కొనుగోలు చేసే శక్తి లేదనుకుంటున్నవారు ఉల్లిగడ్డ కోడిగుడ్డు కూరతో పూట గడిపేస్తున్నారు. టమాటకన్నా చేపలు కూడా తక్కువ ధరకే లభిస్తుండడం గమనార్హం. వచ్చేది నిజశ్రావణ మాసం కావడంతో చాలామంది మాంసాహారానికి దూరంగా ఉంటారు. దీంతో కూరగాయల ధరలు మరింత పెరుగుతాయని భావిస్తున్నారు.

రామారెడ్డిలో కూరగాయల ధరల వివరాలు..

కూరగాయ	ధర(కిలోకు రూ.లలో)	కూరగాయ	ధర(కిలోకు రూ.లలో)
టమాట	180	కాకరకాయ	80
పచ్చిమిర్చి	140	బెండకాయ	80
చిక్కుడు	120	పచ్చ కూర	80
వంకాయ	100	చుక్కకూర	120
బీరకాయ	80	అల్లం	200
		వెల్లుల్లి	200

సామాన్యులకు భారంగా మారిన ధరలు

మార్కెట్లో కూరగాయల ధరలు సామాన్యులకు అందకుండా ఉన్నాయి. పావు కిలో కూడా కొనలేని పరిస్థితులలో నిరుపేదలు మార్కెట్ వైపు వెళ్లడమే మానేశారు. టమాట లేని కూర వండని రోజుల నుంచి టమాటనే కొనలేని పరిస్థితులు తలెత్తాయి. ఇంట్లో ఏ కూర వండినా టమాట వేయడం సాధారణం.. కానీ పెరిగిన ధరలతో టమాటను దూరం పెడుతున్నారు. మండల కేంద్రాలు, పెద్దగ్రామాలలో వార సంతలు జరుగుతుంటాయి. అందులో కూరగాయలు కూడా అమ్ముతుంటారు. గ్రామాల నుంచి వెళ్లి కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. ధరల పెరుగుదలతో చాలామంది సంతలకు వెళ్లడమే మానేశారు. సంతకు రూ. 500 తీసుకెళ్లినా గాని రెండు మూడు రోజులకు సరిపడా కూరగాయలు కూడా రావడం లేదని సామాన్యులు పేర్కొంటున్నారు. కోడిగుడ్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఇబ్బందిపడుతున్నం



ఇంట్లో నలుగురం ఉన్నాం. కూరగాయల ధరలు బాగా పెరగడంతో ఇబ్బందిపడుతున్నం. మూడు కోడిగుడ్లు రెండు ఉల్లిగడ్డలతో తక్కువ ధరలో పూట గడిపేస్తున్నం.


– చిలకవ్వ, గృహిణి, రామారెడ్డి

అమ్మకాలు పెరిగాయి




కూరగాయల ధరలు బాగా పెరిగాయి. కూరగాయల కన్నా కోడిగుడ్లు తక్కువ ధరకు లభిస్తున్నాయి. దీంతో కోడిగుడ్లకు గిరాకీ పెరిగింది. – ప్రమీల, కిరాణం నిర్వాహకురాలు, రామారెడ్డి

ప్రాజెక్టుల్లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



గంగమ్మకు పూజలు చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



ప్రాజెక్టు కట్టపై బందోబస్తును పర్యవేక్షిస్తూ..

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల మంజీర నది ద్వారా మంగళవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 8 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు రెండు వరద గేట్ల ద్వారా అంతే నీటిని మంజీరలోకి విడుదల చేస్తు న్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగుల(17.8 టీఎంసీలు)తో నిండుకుండలా ఉంది.

'సాగర్'ను సందర్శించిన ఎస్పీ

నిజాంసాగర్ ప్రాజెక్టును మంగళవారం సాయంత్రం ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. గంగమ్మకు పూజలు చేశారు. నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు కట్టపైన పర్యాటకులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఆయన వెంట నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్, ఏఎస్సై రాజేశ్వర్ తదితరులున్నారు.

కౌలాస్‌లోకి 551 క్యూసెక్కులు..

కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో కురుస్తున్న వర్షాలకు జుక్కల్ మండలంలోని కౌలాస్‌నాలా ప్రాజెక్టులోకి మంగళవారం 551 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 457.55 మీటర్ల (1.141 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

పోచారం ప్రాజెక్టు పరిశీలన

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టును మంగళవారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు సందర్శించారు. ప్రాజెక్టు ప్రధానగేట్ల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రెయిలింగ్‌ను పరిశీలించారు. ప్రాజెక్టులోకి మంగళవారం 2,118 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ఆయన తెలిపారు. ప్రాజెక్టు అలుగు పైనుంచి 2,098 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోందని, మరో 20 క్యూసెక్కుల నీరు ప్రధాన కాలువలోకి విడుదలవుతోందని పేర్కొన్నారు.



రెయిలింగ్‌ను పరిశీలిస్తున్న డీఈఈ

క్లుప్తంగా

కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన



భిక్కనూరు: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రస్తావన లేకపోవడంపై కాంట్రాక్టు అధ్యాపకులు నిరసన తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పన్నెండు యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ఎస్. నారాయణ గుప్తా, డాక్టర్ యాలాద్రి, నరసయ్య, రమాదేవి, సునీత, శ్రీకాంత్, నిరంజన్ శర్మ, వైశాలి, దిలీప్, సరిత తదితరులున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు..

భిక్కనూరు: పొరుగు సేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో నాన్ టీచింగ్ స్టాఫ్ నిరసన తెలిపారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో విజయ్, శ్రీకాంత్, హారిక, రజితాబాయి, మల్లేశ్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

మద్నూర్(జుక్కల్): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు పూర్తిగా నాశనమయ్యాయని, ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ డోంగ్లీ తహసీల్ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణకు రైతులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాలతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వేసిన అన్ని రకాల పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు ధనుంజయ్, రాజు, గంగాధర్ తదితరులున్నారు.

నటేశ్వరశర్మకు సన్మానం



కామారెడ్డి క్రైం: దాశరథి పురస్కారం పొందిన కవి, అష్టావధాని ఆయాచితం నటేశ్వర శర్మను మంగళవారం కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దాశరథి పురస్కారాన్ని పొందడం ద్వారా జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేశారని నటేశ్వర శర్మను కొనియాడారు. డాక్టర్ శంకర్, మనోహర్‌రావు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బిల్లును ఆమోదించాలని కేంద్ర మంత్రికి వినతి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించి పంపిన కాయతి లభాన రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదపరచాలని మంగళవారం హైదరాబాద్‌లో కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు ర లభాన రాష్ట్ర అధ్యక్షుడు బస్సీ తాన్‌సింగ్ మాట్లాడుతూ.. మధుర లభాన, కాయతి లంబాడా కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చి న్యా యం చేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు బంతి లాల్, ప్రతినిధులు భజన్ లాల్, చద్మల్ ఎంపీటీసీ జగదీష్, తిప్పారం తండా సర్పంచ్ బిషన్, బిర్మల్ తండా సర్పంచ్ దర్బార్, నేరల్ తండా ఉప సర్పంచ్ బస్సి నర్సింగ్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా.. ఏదీ ధీమా

- స్త్రీ నిధి రుణాలపై తీసుకున్న పశువులకు అందని ప్రమాద బీమా
- ప్రమాదవశాత్తూ మరణించి ఏళ్లు గడుస్తున్నా అందని వైనం
- జిల్లా వ్యాప్తంగా రెండేళ్లుగా పేరుకుపోయిన దరఖాస్తులు
- రుణాలు కట్టాలని బాధితుల ఇళ్ల మీదికి వెళ్తున్న ఐకేపీ సిబ్బంది



మృతి చెందిన పశువు(ఫైల్)

బీబీపేట: స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పశువులపై రుణాలు ఇచ్చి చేయూతనిచ్చే స్త్రీ నిధి బ్యాంకు ప్రస్తుతం మహిళలను ఇబ్బందులకు గురి చేస్తోంది. రుణాలు తీసుకునేంత వరకు ఒత్తిడి తీసుకొచ్చి సంఘంలోని మహిళలకు పశువులపై రూ.50 వేల నుంచి లక్ష వరకు రుణాలను మంజూరు చేసింది. పశువులను తీసుకున్న తర్వాత వాటికీ బీమా సదుపాయం సైతం చేశారు. కొన్న పశువులు అనారోగ్య కారణాలతో, మరికొన్ని ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడ్డాయి. వాటికి బీమా డబ్బులు రాకపోవడంతో మహిళలపై ఆర్థిక భారంగా పడింది.

జిల్లా వ్యాప్తంగా 61 పశువుల మృత్యువాత

జిల్లా వ్యాప్తంగా 61 పశువులు ప్రమాదవశాత్తూ, అనారోగ్యాల కారణంగా మృతి చెందడంతో సంబంధిత ఐకేపీ సిబ్బంది పంచనామా నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి చేతులు దులుపుకున్నారు. ఒక్క బీబీపేట మండలంలోనే 12 పశువులు మృతి చెందాయి. అలా చనిపోయి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు బీమా డబ్బులు చెల్లించలేదు. అప్పటి నుంచి మహిళలు మృతి చెందిన పశువులపై ఉన్న రుణాలను ప్రతి నెలా కట్టడం మానేశారు. కొన్ని రోజుల నుంచి ఐకేపీ సిబ్బంది రుణాలు తీసుకున్న మహిళల ఇళ్ల వద్దకు వెళ్లి వారిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. పశువులపై ఉన్న బీమా వచ్చినా రాకపోయినా అప్పులు మాత్రం కట్టాల్సిందేనని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అంతే కాకుండా ఇంటి ముందుకు డ్వాక్రా మహిళలను పంపించి కట్టాల్సిందేనని పట్టుబడుతున్నారు.

“అప్పులు కట్టడం ఇబ్బందిగా ఉంది

నేను ఆవు తీసుకొని మూడేళ్లు అవుతోంది. సుమారు రూ.60 వేలు అప్పుగా తీసుకొని ఆవును పెంచుకున్నాను. తీసుకున్న తర్వాత 5 నెలలకు అనారోగ్యం కారణంగా ఆవు మృత్యువాత పడింది. దీంతో అప్పటి నుంచి కట్టలేకపోవడంతో మహిళా సంఘాల సభ్యులను సీసీలు, వీవోఏలు ఇంటి వద్దకు పంపిస్తున్నారు. ఇబ్బంది పెడుతున్నారు. బీమా డబ్బులు వస్తే తప్ప అప్పు తీర్చే పరిస్థితి లేదు.

– లక్ష్మి, డ్వాక్రా మహిళ, మల్కాపూర్

పంచనామా నిర్వహించి పంపించాం



పశువులు అనారోగ్యం, ప్రమాదాల బారిన పడి మృతి చెందిన వెంటనే సంబంధిత మహిళా సంఘాలు, సీసీలు, స్త్రీ నిధి బ్యాంకు సభ్యులతో పంచనామా నిర్వహించి నివేదికలు అందజేశాం. కానీ ఇప్పటివరకు బీమా డబ్బులు రాలేదన్న మాట వాస్తవమే. అయినప్పటికీ మేము ప్రతిసారి అధికారులను అడుగుతున్నాం. కానీ ఇంకా వస్తలేవు.

– బాలపోచయ్య, ఏపీఎం, బీబీపేట

ఉన్నతాధికారులకు పంపించాం

జిల్లా వ్యాప్తంగా 61 పెండింగ్ ఫైళ్లను గత నెలలో సంగారెడ్డిలో జరిగిన సమావేశంలో ఉన్నతాధికారులకు అందజేశాం. కొన్ని పశువుల ఫొటోల మార్పిడి జరిగిందని, మరికొన్ని పశువుల చెవి పోగులు మార్పిడి చేసి మృతి చెందిన పశువులకు తగిలించారని.. తదితర కారణాలతో బీమా డబ్బులు రావడం లేదు. మరో నెల రోజుల్లోగా అధికారుల నుంచి వివరాలు అందుతాయి. అప్పుడు బీమా డబ్బులు వచ్చే అవకాశం ఉంది.

– శ్రీనివాస్, ఆర్‌ఎం, స్త్రీ నిధి బ్యాంకు

హైలెవల్ వంతెన నిర్మించండి



గుజ్జుల్ తండా సమీపంలో వంతెనను పరిశీలిస్తున్న సుభాష్ రెడ్డి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుజ్జుల్ వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలని కాంగ్రెస్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని పలు గ్రామాలు, తండాల్లో పర్యటించి భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించారు. గాంధారి నుంచి దుర్గం రహదారిలో గుజ్జుల్ తండా–లొంక తండా మధ్యలో ఉన్న వాగుపై లోలెవల్ వంతెన ఉందన్నారు. వర్షాకాలంలో వాగు వంతెన పై నుంచి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని, దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే హైలెవల్ వంతెనకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

అన్నాబావుసాఠే ఆశయాలు సాధించాలి



మద్నూర్: అన్నాబావుసాఠే ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. అన్నాబావుసాఠే జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి ఆమె నివాళులు అర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు హన్మండ్లు, నాయకులు యాదవ్‌రావు, వెంకట్‌కాలే, సంతోష్ తదితరులున్నారు.

పల్లె దవాఖానాలను అభివృద్ధి చేయాలి

డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్



ఆయుష్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

రామారెడ్డి(ఎల్లారెడ్డి): గ్రామాల సర్పంచులు అధ్యక్షుడిగా వ్యవహరించి పల్లె దవాఖానాలను అభివృద్ధి చేయాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రామారెడ్డి, అన్నారం ప్రభుత్వ దవాఖానాల ఆధ్వర్యంలో జన ఆరోగ్య సమితి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీపీ దశరథ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. శిక్షణలో భాగంగా జన ఆరోగ్య సమితి(జేఏసీ)లో ఉన్న కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చివరగా ఆయుష్ కరపత్రాలను ఆవిష్కరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష, వైద్యాధికారులు సురేష్, మానస, ఆయుర్వేదిక్ వైద్యాధికారి చైతన్య, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంఈవో యోసేఫ్, రామారెడ్డి సర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలని హోంగార్డుల వినతి



కామారెడ్డి క్రైం: తమను పర్మినెంట్ చేసి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికు కామారెడ్డి సబ్ డివిజన్ హోంగార్డులు మంగళవారం వేర్వేరుగా వినతి పత్రాలను అందజేశారు. చనిపోయిన హోంగార్డుల పిల్లలకు గానీ, భార్యలకు గానీ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఉద్యోగ విరమణ తర్వాత అన్ని రకాల బెనిఫిట్స్ వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని విన్నవించారు.

ఎంపీటీసీ నిరాహార దీక్షకు బీజేపీ మద్దతు

ఎల్లారెడ్డి: పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో అన్నాసాగర్ ఎంపీటీసీ ఉమాదేవి చేస్తున్న రిలే నిరాహార దీక్షకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాం రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సామెల్, తదితరులున్నారు.

ఎంపీటీసీ ఉమాదేవి దీక్ష చేయడం సరికాదు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ హయాంలో అన్నాసాగర్ గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సర్పంచ్ నాగరాజుతో కలిసి నేతలు మాట్లాడారు. ఎంపీటీసీ ఉమాదేవి చేస్తున్న దీక్ష సరికాదని విమర్శించారు. ఎమ్మెల్యేకు అన్నాసాగర్ సమస్యలను తెలియజేయకుండా అభివృద్ధి చేయలేదని, సమస్యలు పరిష్కరించాలని దీక్ష చేయడం సమంజసం కాదన్నారు. తిమ్మారెడ్డి సర్పంచ్ అబ్దుల్ అలీ, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కామారెడ్డి క్రైమ్: జిల్లా కేంద్రంలోని రామారెడ్డి రోడ్డులో ఉన్న ఓ ఇంట్లో పేకాట నిర్వహిస్తుండగా సీసీఎస్ పట్టణ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని దాదాపు రూ.30 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాజాన్ని కాపాడేది కళలు, సాహిత్యమే

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్



మాట్లాడుతున్న నలిమెల భాస్కర్

కామారెడ్డి అర్బన్: చదువుతోనే భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ అన్నారు. కళలు, సాహిత్యమే సమాజాన్ని కాపాడుతాయన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ‘చదవు–జీవితం’ అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో నలిమెల భాస్కర్ అతిథి ప్రసంగం చేశారు. తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ వి శంకర్ కార్యక్రమ సమన్వయం చేస్తు నలిమెల జీవిత విశేషాలను పరిచయం చేశారు. నలిమెల మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతికను అవసరం మేరకు వినియోగించుకోవాలని, కృత్రిమ మేధస్సుకు బానిస అయితే జీవితంలో పెద్ద తప్పిదం అవుతుందన్నారు. రేపటి సమాజాన్ని కాపాడేది కళలు, సాహిత్యమే అన్న నిజాన్ని గ్రహించాలన్నారు. ఆయన రూ.5వేల విలువైన పుస్తకాలను కళాశాల తెలుగుశాఖకు బహుకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె కిష్టయ్య మాట్లాడుతు.. గొప్ప రచయిత, బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్ తమ కళాశాల పూర్వ విద్యార్థి కావడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సిరిగాద శంకర్, పి రామకృష్ణ, టి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, లక్ష్మణాచారి, కృష్ణమోహన్, రాములు, రాజ్‌గంభీర్‌రావు, జి చంద్రశేఖర్‌గౌడ్, శ్రీవేణి, లక్ష్మణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ జీపీలుగా తీర్చిదిద్దాలి

- పంచాయతీల ప్రగతికి కృషి చేయాలి
- అదనపు కలెక్టర్ మను చౌదరి



మొక్కలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు ఆదర్శంగా నిలిచే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మను చౌదరి సూచించారు. మంగళవారం కుప్రియాల్, అడ్లూర్‌ఎల్లారెడ్డి, తిర్మన్‌పల్లి, ధర్మారావ్‌పేట్, మోడెగాం, జనగాం, దగ్గి, యాచారం, పూర్యానాయక్ తండా, సాజ్యానాయక్ తండాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల పనితీరు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, అవెన్యూ ప్లాంటేషన్, కంపోస్ట్ షెడ్లను పరిశీలించారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాలను ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచ్‌లు ఆయనను సన్మానించారు. డీఎస్పీ శ్రీనివాసులు, ఎఫ్‌డీవో గోపాల్ రావు, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, ఎంపీడీవో కొండ లక్ష్మి, ఎంపీవో సురేందర్ రెడ్డి, సర్పంచ్‌లు ముదుపు బాల్‌రెడ్డి, సాయిరెడ్డి, పైడి జానకి, బడాల భాస్కర్ రెడ్డి, కుంట తిరుమల, మొలిగె శంకర్, సుందరమ్మ, లత, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి

మద్నూర్(జుక్కల్): పంటలను తెగుళ్ల నుంచి రైతులు కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని చిన్న తడ్గూర్ శివారులోని పత్తి, సోయాబీన్, పెసర, మినుము, కంది పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. పత్తి పంటలలో రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, పచ్చదోమ, తామర పురుగును గమనించినట్లు తెలిపారు. దీని నివారణకు అసెటమిప్రిడ్ 50 గ్రాములు ఎకరాకు లేదా థైమెథ్యాగ్జమ్ 50 గ్రాములు ఎకరాకు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. సోయాబీన్ పంటలో యెల్లో మొసైక్ వైరస్ (వైఎంవీ) నివారణకు ఫ్లోనాకామిడ్ 2 మిల్లీలీటర్లు లీటర్ నీటికి లేదా అసెటమిప్రిడ్ 50 గ్రాముల మందును నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. అధిక వర్షాలతో పంటలో ఎదుగుదల తగ్గితే 19.19.19(పాలిఫీడ్) ఎకరాకు ఒక కేజీ పిచికారి చేయాలన్నారు. ఏఈవో సతీష్, రైతుబంధు సమితి అధ్యక్షుడు శంకర్‌పటేల్, రైతులు శివాజీ, దిగంబర్, దిలీప్ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై ఆందోళన

- బాన్సువాడలో ధర్నా చేసిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు



ధర్నా చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

బాన్సువాడ: పట్టణంలో అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్, బీజేపీ నేతలు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్ మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని సర్వే నంబర్ 288/1, 288/2 లలో దర్గాకు కేటాయించిన స్థలంలో వెంచర్ ఏర్పాటు చేశారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సమయంలో బీఆర్‌ఎస్ నేతలు కల్పించుకుని కాంగ్రెస్, బీజేపీ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మూడు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి వారికి సర్దిచెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఖలేక్, మంత్రి గణేశ్, మధుసూదన్‌రెడ్డి, నార్ల రాఘవేందర్, దాసరి శ్రీనివాస్, బీజేపీ నాయకులు చీదరి సాయిలు, శ్రీనివాస్, పైడిమల్ లక్ష్మీనారాయణ, కోనాల గంగారెడ్డి, సాయిబాబా, రాజాసింగ్, కొండని గంగారాం, అశ్విన్, వెంకట్, రమేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్)

తాడ్వాయి: పెళ్లి కావడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయిలో చోటు చేసుకొంది. ఎస్సై ఆంజనేయులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జౌడి శ్రీకాంత్‌రెడ్డి (26)కి రెండేళ్ల క్రితం పెళ్లి నిశ్చయమై, రద్దయింది. అప్పటి నుంచి పెళ్లి సంబంధాలు రావడం లేదు. తనకు పెళ్లి అవుతుందో, లేదనని బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన శ్రీకాంత్‌రెడ్డి సోమవారం తాడ్వాయి శివారులోని తన వ్యవసాయం పొలం వద్దకు వెళ్లి, అక్కడ ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం అటువైపు వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి బాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. గతంలో శ్రీకాంత్‌రెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందగా ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తండ్రి బాల్‌రెడ్డి రోదనలు మిన్నంటాయి.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ

వర్ని(మోస్రా): మోస్రాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దొంగలు కాపర్ వైర్, ఆయిల్ చోరీ చేసినట్లు వర్ని ఎస్సై కృష్ణ తెలిపారు. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రూ.15 విలువ గల రాగి తీగ, ఆయిల్ ఎత్తుకెళ్లారని చెప్పారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ ఓం ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అదుపు తప్పిన వాహనం



రెంజల్: మండలంలోని దండిగుట్ట–కల్యాపూర్ గ్రామాల మధ్య మంగళవారం ఓ ఐచర్ వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. మండలంలోని సాటాపూర్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న వాహనం దండిగుట్ట వద్ద కల్వర్టును ఢీకొంది. అనంతరం రోడ్డుకు అవతలి పక్క ఉన్న చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఐచర్ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

బాల్కొండలో దొంగల హల్‌చల్



చోరీ జరిగిన సెల్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. రెండు మొబైల్ దుకాణాలు, ఓ మెడికల్ షాపులో చోరీకి పాల్పడ్డారు. పాత జాతీయ రహదారి 44కు అనుకుని ఉన్న షాపుల్లోనే చోరీ జరిగింది. దుండగులు రాత్రి 11.30 గంటలకు సిద్దార్థ సెల్‌పాయింట్‌లో చోరీకి పాల్పడ్డట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఆ దుకాణంలో పది కొత్త ఫోన్లు, మరో పది వరకు రిపేర్ కోసం వచ్చిన ఫోన్లు, రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. మెడ్‌ప్లస్ మెడికల్ షాపు పక్కన గల మరో సెల్ పాయింట్‌లో చోరీకి యత్నించారు. కాని అందులో ఏమి దొరకలేదు. వన్నెల్(బి)చౌరస్తా వద్దగల మద్దుల గంగారాం కాంప్లెక్స్ మెడికల్ షాపులో చోరీకి పాల్పడి, ఒక లాప్‌ట్యాప్, 12 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి, ఏఎస్సై శంకర్ చోరీ జరిగిన దుకాణాలను పరిశీలించారు. ఆ పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రాలు సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి



భుక్యా గణేశ్ (ఫైల్)

రామారెడ్డి: మండలంలోని రెడ్డిపేట బిన్నీ రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పని చేసే బుక్యా గణేశ్ కరెంట్ షాక్‌తో సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలు.. నడుమి తండాకు చెందిన భుక్యా గణేష్(35) రెడ్డిపేటలోని బిన్నీ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం రైస్‌మిల్లు యజమాని నర్సాగౌడ్ వ్యవసాయ భూమి వద్ద నుంచి టాటా ఏస్ వాహనాన్ని తీసుకు రావడానికి వెళ్లాడు. వాహనంలో గడ్డిమోపులు తీసుకొని వస్తుండగా మార్గమధ్యలో వాహనం బురదలో ఇరుకుపోయింది. గణేశ్ కిందకు దిగి టైర్ కింద రాడ్ వేసి పైకి లేపే క్రమంలో అక్కడే ఉన్న వ్యవసాయ మోటార్‌కు వెళ్లే కరెంటు తీగ తాకి షాక్‌తో పడిపోయాడు. ఆయనను వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మోటారు తీసుకొని వస్తూ.. నీట మునిగి ఒకరు

బోధన్‌రూరల్: బోధన్ మండలం కల్దుర్కి సిద్దాపూర్ శివారులో గల మంజీర నదిలో కల్దుర్కి గ్రామానికి చెందిన సాయిలు(58) పడి మృతి చెందాడు. మోటార్ మెకానిక్‌గా జీవనం సాగించే సాయిలు ఓ రైతు మోటార్‌ను నదిలో నుంచి మరమ్మతుల కోసం ఒడ్డుకు తెస్తుండగా నీటిలో పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగానాథ్ తెలిపారు.

ఇద్దరి రిమాండ్

మోపాల్: మండలంలోని మంచిప్పలో వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరిని రిమాండ్ చేసినట్లు ఎస్సై రాము మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన సాయికుమార్, మౌనిక (25) దంపతులు. కుటుంబ కలహాలతో ఇటీవల మౌనిక ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు మౌనిక అత్త నవనీత, భర్త సాయికుమార్‌పై కేసు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థి

బోధన్: పట్టణ శివారులోని ఎస్సీ గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి శశాంక్ మంగళవారం అదృశ్యమైనట్లు ప్రిన్సిపాల్ పూర్ణ చందర్ రావు తెలిపారు. విద్యార్థి కుటుంబీకులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. సదరు విద్యార్థి గతంలో పాఠశాల నుంచి పారిపోయాడన్నారు. టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. కాగా ఆ విద్యార్థి దొరకడంతో పోలీసుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నగరంలో వివాహిత..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత బుర్కాలో అదృశ్యమైంది. గ్రూప్ పరీక్ష కోసం వచ్చిన ఇందల్వాయికి చెందిన సదరు యువతి మరో వ్యక్తితో కలిసి బుర్కాలో వెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. దీనిపై గతంలోనే కేసు నమోదు కాగా.. మంగళవారం హిందు సంఘాల నాయకులు ఠాణాకు వెళ్లి ఈ కేసు గురించి ఆరా తీశారు. పెళ్లి అయి రెండు నెలలు అవుతుందని, పరీక్ష నిమిత్తం తీసుకు వచ్చానని ఆమె భర్త శ్రీకాంత్ తెలిపారు.

ఒకరిపై ఫోర్జరీ కేసు

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ రమేశ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన అశోక్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ–బోర్లం రోడ్డులో అశోక్ రేకుల షెడ్డును నిర్మించాడు. షెడ్డుకు కరెంటు మీటర్ కోసం దరఖాస్తు ఫామ్‌పై కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశాడని సీఐ పేర్కొన్నారు. కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.